

## రోడ్డు కబ్జాకు యత్నం

కాలనీలకు వెళ్లే ప్రధాన దారి కబ్జాకు పలువురు యత్నించిన ఘటన పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలో జరిగింది. 8లో▸



## గోడౌన్‌లో అగ్నిప్రమాదం

ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 8లో▸



## అందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో▸

### న్యూస్‌రీల్

## ప్రభుత్వ ఆస్పత్రిలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర రావు

**షాద్‌నగర్‌రూరల్:** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ సేవల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఆస్పత్రి సిబ్బందిని విచారించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి ఇక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఓపీ చీటీలు ఇచ్చేందుకు డబ్బులు తీసుకుంటున్నారనే విషయంలో పూర్తి విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. కలెక్టర్ తీసుకునే నిర్ణయం మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట జిల్లా డీసీహెచ్ డాక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా మాస్ మీడియా ఇన్‌చార్జి శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## శీతాకాలం.. ఆరోగ్యం పదిలం

**షాద్‌నగర్‌రూరల్:** శీతాకాలంలో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకునేందుకు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి తీవ్రత పెరుగుతోందని అన్నారు. మంచు కురుస్తున్న సమయాల్లో బయటకు వెళ్లడం, ప్రయాణాలు చేయడం మానుకోవాలన్నారు. ఉదయం చలిలో బయటకు వెళ్లకుండా ఉండాలని, రాత్రి సమయంలో త్వరగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. చలి ఎక్కువగా ఉన్న సమయంలో ఆస్తమా ఉన్నవారు ఎట్టి పరిస్థితుల్లో బయటకు వెళ్లకూడదన్నారు. వీలైనంతగా వేడి పదార్థాలు, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీహెచ్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌కు ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయండి

**ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి**



**షాద్‌నగర్:** ఎంతో మంది విద్యార్థులున్న షాద్‌నగర్‌కు ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న షాద్‌నగర్ ప్రాంతం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్, పీఅండ్‌జీ వంటి పెద్ద సంస్థలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేసి ఐటీ రంగాన్ని విస్తరిస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న పరిగి, జడ్చర్లలో ఇంజనీరింగ్ కళాశాలలు లేవని బాలకిష్టారెడ్డి దృష్టికి తెచ్చారు. షాద్‌నగర్‌లో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఆయా సంస్థల్లో విద్యార్థులకు సులభంగా ఉద్యోగావకాశాలు ఉంటాయని వివరించారు.

## నూతన నియామకం



శ్రీనివాస్‌గుప్తాకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘం ప్రతినిధులు

**మీర్‌పేట:** ఆర్యవైశ్య మహాసభ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా మీర్‌పేటకు చెందిన తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా మంగళవారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీనివాస్‌గుప్తాను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఎస్ఆర్ మూర్తి, వెంకటేశ్ గుప్తా, కృష్ణ, జగన్‌గుప్తా, కిషన్‌గుప్తా, వెంకన్నగుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: బెకరీలో కేక్‌ల కొనుగోళ్లు



ఆమనగల్లు: రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

## నయా జోష్

2024కు వీడ్కోలు చెబుతూ.. 2025 నయా సాల్‌కు గ్రాండ్‌గా వెల్‌కం పలుకుతూ జిల్లావాసులు సంబరాల్లో మునిగితేలారు. మంగళవారం అర్ధరాత్రి కాగానే రోడ్లపైకి వచ్చి బాణసంచా కాల్చారు. కేరింతలు కొడుతూ కేక్‌లు కట్ చేశారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు వాకిళ్ల ముందు కళ్లాపి చల్లి.. రంగురంగుల ముగ్గులతో కొత్త ఏడాదికి ఘన స్వాగతం పలికారు. బేకరీలు, మిఠాయి దుకాణాలు, రంగుల దుకాణాల్లో ఎక్కడ చూసినా సందడి కనిపించింది. ఆలయాల్లో దర్శనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# టమాటా.. రైతు వెత



షాబాద్ మండలం బొబ్బిలిగామకు చెందిన ఈ రైతు పేరు సాయన్న. తనకున్న పొలంలో నాలుగెకరాల్లో టమాటా సాగు చేశాడు. ప్రస్తుతం దిగుబడి బాగా వచ్చింది. ఒక్కో కూలీకి రూ.500 చొప్పున నలుగురు కూలీలకు రూ.2000 ఇచ్చి పంట తెంపించాడు. ఆటో కిరాయి రూ.500 మాట్లాడుకుని 20 బాక్స్‌ల టమాటాను చేవెళ్ల మార్కెట్‌కు తీసుకువచ్చాడు. ఒక్కో బాక్స్ (23 నుంచి 25 కిలోలు) రూ.50 చొప్పున అమ్ముడు పోయింది. మొత్తం రూ.1000 చేతికి వచ్చాయి. అదనంగా రూ.1,500 భారం పడింది. పెట్టుబడి కాదుకదా మార్కెట్‌కు తెచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నాడు.

### మార్కెట్‌కు పెరిగిన దిగుబడులు

- అమాంతం పడిపోయిన ధరలు
- బహిరంగ మార్కెట్‌లో రూ.15 నుంచి రూ.20
- రైతుకు దక్కేది మాత్రం రూ.2 నుంచి రూ.5
- ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన
- పశువులకు మేతగా పారబోత



చేవెళ్ల మార్కెట్‌లో అమ్ముడుపోకుండా మిగిలిన టమాటా బాక్స్‌ల వద్ద రైతుల నిరీక్షణ

**చేవెళ్ల:** టమాటా ధరలు పాతాళానికి పడిపోయాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతులకు కంట నీరు తెప్పిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం వరకు అమాంతం పెరిగి మురిపించిన ధరలు ఒక్కసారిగా పడిపోయి రైతులకు కన్నీరు పెట్టిస్తున్నాయి. మార్కెట్‌కు తరలించేందుకు రవాణా, కూలీల ఖర్చు కూడా రావడం లేదని వాపోతున్నారు. చేవెళ్ల మార్కెట్‌కు తీసుకు వచ్చిన టమాటాలు అమ్ముడుపోక ఒకటి రెండు రోజులు అక్కడే వదిలేస్తున్నారు. ధరలు లేకపోవడంతో తెచ్చిన వాటిని ట్రాక్టర్లలో నింపి దూరంగా పారబోస్తున్నారు. మార్కెట్‌లోని ఏజెంట్లు అదనంగా ట్రాక్టర్ కిరాయి చెల్లించి మరీ పారబోసే పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**దిగుబడులు ఘనం.. ధరలు పతనం**

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌కు రైతులు నిత్యం 1000 నుంచి 2000 వరకు టామాటా బాక్స్‌లు తెస్తున్నారు. ఒక్కో బాక్స్ రూ.50 నుంచి రూ.120 ధర పలుకుతోంది. అంటే రైతుకు కిలోకు రూ.2 నుంచి రూ.5లోపు మాత్రమే వస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.10 నుంచి రూ.20 వరకు పలుకుతుండగా రైతుకు మాత్రం దక్కేది అంతంత మాత్రమే. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3వేల నుంచి 5వేల ఎకరాల్లో పంట సాగవుతుందని అంచనా.



పారబోసేందుకు ట్రాక్టర్‌లో తరలింపు

హైదరాబాద్ మార్కెట్‌కు అనంతపురం జిల్లా నుంచి భారీగా దిగుబడులు వస్తుండడంతో ధరలు పతనం అవుతున్నాయని మార్కెట్ ఏజెంట్లు చెబుతున్నారు.

### ఖర్చులు రావడం లేదు



ఎకరం పొలంలో టమాటా సాగు చేశాను. ఇటీవలే దిగుబడికి వచ్చింది. వారం రోజుల నుంచి మార్కెట్‌కు తెస్తున్నాను. ఒకరోజు తెచ్చినవన్నీ అలాగే ఉండిపోయాయి. మరోరోజు బాక్స్‌కు రూ.100 మాత్రమే వచ్చింది. మార్కెట్‌కు చాలా మంది రైతులు దిగుబడులు తేవడంతో కొనుగోళ్లు తగ్గాయి. కనీస ధర వచ్చినా పెట్టుబడి దక్కేది. ధరలు ఇలా ఉంటే ఖర్చులు కూడా రావడం లేదు.

– చెన్నయ్య, రైతు, బొబ్బిలిగామ, షాబాద్ మండలం

### ట్రాక్టర్ కిరాయి కట్టి పారబోయించా



దిగుబడులు ఎక్కువగా వస్తున్నాయి. రైతులు ఎక్కువ సంఖ్యలో బాక్స్‌లు తెస్తున్నారు. ధరలు లేకపోవటంతో చిన్న సైజులో ఉన్న టమాటా అమ్ముడు పోవడం లేదు. అలాగే మిగిలిపోతోంది. రెండురోజులు చూసి ట్రాక్టర్‌కు రూ.3వేలు కిరాయి చెల్లించి దూరంగా పారబోయించాను.

– ఎ.మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ ఏజెంట్

### అమ్మించే ప్రయత్నం



మార్కెట్‌కు రోజుకు 1000 కిపైగా టమాటా బాక్స్‌లు అమ్మకానికి వస్తున్నాయి. కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. రైతులకు మేలు చేసేందుకు పూర్తిగా అమ్మేందుకు ప్రయత్నిస్తాం. తక్కువ ధర అయినా అమ్మించేందుకు కృషి చేస్తున్నాం.

– రాఘవేందర్, మార్కెట్ కమీషన్ ఏజెంట్



ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి-నీరజ దంపతులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు, నిర్వాహకులు

## ముగిసిన పత్రీజీ ధ్యానమహాయాగం

**కడ్తాల్:** కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్ క్షేత్రంలో పదకొండు రోజుల పాటు కొనసాగిన పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ధ్యాన గురువు పరిణిత పత్రి మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి జ్ఞాన యోగి కావాలన్నదే పత్రీజీ సంకల్పమని అన్నారు. ప్రతి ఒక్కరూ స్నేహ పూర్వకంగా మెలగాలి, ముందుగా మనతో మనం స్నేహం చేయాలని సూచించారు. 2025ని ఫ్రెండ్‌షిప్ ఇయర్‌గా ప్రకటించారు. ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ధ్యాన సంబురాలను విజయవంతం చేసిన ప్రతి పిరమిడ్ మాస్టర్, ధ్యానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు, ధ్యాన గురువులు, మాస్టర్లు, సంగీత విద్వాంసులు, కళాకారులు, ట్రస్ట్ చైర్మన్, సభ్యులను ఘనంగా సన్మానించారు. సంగీత ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి.

**మానసిక ప్రశాంతతకు ధ్యానం దోహదం**

మానసిక ప్రశాంతతకు ధ్యానం దోహదపడుతుందని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బొల్లు మహేందర్ అన్నారు. ప్రపంచ మానవాళికి ధ్యానంతో కలిగే ప్రయోజనాలను, జీవాత్మ, పరమాత్మ తత్వాలు, ధ్యానం ద్వారా జ్ఞాన సముపార్జన, మానవ జన్మ గొప్పతనం, కర్మ బంధాల విమోచనం తదితర ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. ధ్యాన మహాయాగానికి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర నాయకుడు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ నిర్వాహకులను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



కళాకారిణి నృత్య ప్రదర్శన

## నేటి నుంచి ఎంఎంటీఎస్ కొత్త టైంటేబుల్

**సాక్షి, సిటీబ్యూరో:** జనవరి 1 నుంచి ఎంఎంటీఎస్ కొత్త టైంటేబుల్ అమల్లోకి రానుందని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వివిధ మార్గాల్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైళ్ల వేళల్లో మార్పులు, చేర్పులు చేసినట్లు చెప్పారు. ఈ మార్పులకు సంబంధించిన సమాచారం అన్ని ఎంఎంటీఎస్ స్టేషన్లలో అందుబాటులో ఉంటుందన్నారు.

# చిలుకూరులో భారీగా ఏర్పాట్లు

- నూతన సంవత్సర వేళ తరలిరానున్న భక్తులు
- ఇబ్బంది లేకుండా పార్కింగ్, క్యూలైన్లు సిద్ధం
- అదనపు బస్సులు నడపనున్న ఆర్టీసీ

**మొయినాబాద్:** నూతన సంవత్సరం మొదటి రోజు సందర్భంగా బుధవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ప్రతి సంవత్సరం జనవరి 1న స్వామివారిని దర్శించుకునేందుకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది సైతం అదే స్థాయిలో దర్శనానికి వచ్చే అవకాశం ఉంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అర్చకులు, గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ తగిన ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, భక్తులు ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు సిద్ధం చేశారు. ఆర్టీసీ బస్సులు ఆలయానికి కిలోమీటర్ దూరం నుంచే వెనక్కి వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఆలయ ప్రాంగణంతోపాటు బయట కూడా క్యూలైన్లకోసం బారీకేడ్లు రెడీ చేశారు. భక్తులందరికీ మహాద్వార దర్శనం ఉంటుంది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉంది.

**పార్కింగ్‌కు అనువైన స్థలాలు**

భక్తులకు ఇబ్బంది కలుగకుండా వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను గుర్తించారు. ఆలయ అర్చకులు, పోలీసులు కలిసి ఆలయ పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి అందులో వాహనాలు పార్కింగ్ చేసేందుకు చదును చేయించారు. ఆలయం దగ్గరలోనే పార్కింగ్‌కోసం మూడు స్థలాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేశారు.

**ఆర్టీసీ అదనపు బస్సులు**

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అదనపు బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రతి రోజు మెహిదీపట్నం నుంచి చిలుకూరు బాలాజీ దేవాలయానికి 11 బస్సులు 75 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతి 12 నిమిషాలకు ఒక బస్సు ఉంటుంది. బుధవారం అదనంగా మరో 10 బస్సులను 70 ట్రిప్పులు నడుపుతామని మెహిదీపట్నం డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. అవసరమైతే ఇతర రూట్లలోని బస్సులను సైతం మళ్లిస్తామన్నారు.



చిలుకూరు బాలాజీ దేవాలయం

**భారీ బందోబస్తు**

బుధవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 70 మంది పోలీసులతోపాటు సుమారు వంద మంది వలంటీర్లతో ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ అధికారులు ఇప్పటికే ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు.

### రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు



భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశాం. ఆలయానికి కొద్ది దూరంలో వాహనాలు పార్కింగ్ చేసి కాలి నడకన భక్తులు ఆలయానికి రావాల్సి ఉంటుంది. వచ్చిన భక్తులు నేరుగా క్యూలైన్ల ద్వారా స్వామివారి దర్శనానికి వెళ్లే విధంగా బారీకేడ్లు ఏర్పాటు చేశాం. మహా ప్రదక్షిణలు ఉండవు. భక్తులు నాలుగు వరుసల్లో మహాద్వార దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశాం.

– రంగరాజన్, ఆలయ అర్చకుడు



భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

# మతసామరస్యాన్ని కాపాడాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య**

**ఇబ్రహీంపట్నం:** దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న మత విద్వేష రాజకీయాలను నిరోధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. పార్టీ జిల్లా నూతన కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మత సామరస్యాన్ని కాపాడాలని, రాజ్యాంగ విలువలే ప్రతిపాదికగా రాజకీయాలు ఉండాలని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలు, ఆదివాసీలు, దళితులపై అనేక హింసాత్మకదాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నట్లు ఆరోపించారు. హిందూ మతోన్మాదం ఎజెండాగా బీజేపీ పనిచేస్తోందని మండిపడ్డారు. పెరుగుతున్న నిరుద్యోగం, పేదరికం, అవినీతి, కార్పొరేట్ శక్తుల దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించి మతం మత్తులో ముంచే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. అసంఘటితరంగం, కార్మిక, కర్షక, వ్యవసాయ, మహిళా, విద్యారంగ సమస్యల పరిష్కరంపై పాలకులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫార్మా కోసం సేకరించిన రైతుల భూములను వాపస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూముల చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయని.. జిల్లాలో 17,700 ఎకరాల పేదల భూములను గత ప్రభుత్వం కొల్లగొట్టిందని ఆరోపించారు. పేదలకు చెందాల్సిన భూములు వారికే ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, దశలవారీగా ఉద్యమాలను బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు చంద్రమోహన్, దుబ్బాక రాంచందర్, డి.జగదీశ్, ఏర్పుల నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పగడాల యాదయ్య

# తప్పు చేస్తే శిక్ష తప్పదు!

**సాక్షి, సిటీబ్యూరో:** 'కానూన్ కే హాత్ లంబే హోతే హై'.. దీన్నే రాచకొండ పోలీసులు తు.చ. తప్పకుండా అనుసరిస్తున్నారు. అందుకే ఈ కమిషనరేట్ పరిధిలో తప్పు చేసి తప్పించుకోలేరు. నేరస్తులు ఎవరైనా శిక్ష తప్పదనే విధంగా కేసులను సమర్థవంతంగా దర్యాప్తు చేస్తున్నారు. నేరం జరిగిందంటే చాలు అన్ని కోణాల్లో విశ్లేషించి పక్కా సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. నేరస్తుడు తప్పించుకునే అవకాశమే లేకుండా అన్ని రకాల ఆధారాలను అభియోగపత్రంలో పొందు పరిచి న్యాయస్థానానికి సమర్పిస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో అత్యధిక నేర నిరూపణ (కన్విక్షన్) రేటు రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోనే నమోదైంది. గతేడాది 64 శాతం కన్విక్షన్ రేటుతో వరుసగా ఆరో ఏడాది రాచకొండ తొలి స్థానంలో నిలిచింది.

**ఒక్క కేసులో 14 మందికి జీవిత ఖైదు**

2024లో రాచకొండలో 33,084 కేసులు నమోదయ్యాయి. 8,734 కేసులు పరిష్కారం కాగా.. ఇందులో 5,568 కేసుల్లో న్యాయస్థానాలు జైలు శిక్షలు విధిస్తూ తీర్పు వెలువరించాయి. నేరాల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో రాచకొండ పోలీసులు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారు. 2024లో 160 మంది నిందితులను కోర్టు బోను ఎక్కించారు. మోటకొండూరు ఠాణా పరిధిలో చేతబడి చేస్తున్నాడనే నెపంతో కొందరు గ్రామస్తులు సీసా యాదగిరి (85)ని క్రూరంగా హత్య చేశారు. పక్కా ఆధారాలు సేకరించిన పోలీసులు బుర్రి రాజేశ్, నరేశ్, శ్రవణ్, సత్యనారాయణ, లలిత అంజమ్మతో సహా 14 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో న్యాయస్థానం 14 మందికి జీవిత ఖైదు విధించింది.

**కమిషనర్ ప్రత్యేక పర్యవేక్షణ**

'తప్పు చేసిన వారు తప్పించుకోలేరు. నేరం చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే' అని రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్ బాబు తన సిబ్బందికి తరుచూ చెబుతుంటారు. నేరం చేసిన వారికి శిక్ష పడేలా చేయడంలో సీపీ ప్రత్యేక చొరవ తీసుకుంటారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్స్, విచారణాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తుంటారు. చార్జిషీటు దాఖలు చేయడంలో మెలకువలు, సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలను సేకరించి న్యాయస్థానంలో ప్రవేశపెట్టే అంశాలపై సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తుంటారు. ఫలితంగా నిందితులు తప్పించుకునే అవకాశం లేకుండా అభియోగపత్రాలు దాఖలు చేయడంలో రాచకొండ పోలీసులు సఫలీకృతం అవుతున్నారు.



### దోషులు తప్పించుకోలేరు

విజుబుల్ పోలీసింగ్, సత్వర స్పందన, సాంకేతికత వినియోగంతో కేసులను దర్యాప్తు చేస్తున్నాం. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను సవాల్‌గా తీసుకొని విచారిస్తున్నాం. పక్కా సాక్ష్యాధారాలను సేకరిస్తున్నందున..నేరగాళ్లు ఇక పోలీసుల కళ్లుగప్పి తప్పించుకోలేరు. శిక్ష అనుభవించి తీరాల్సిందే.

– సుధీర్ బాబు, పోలీసు కమిషనర్, రాచకొండ

# రోడ్డు కబ్జాకు యత్నం

**అడ్డంగా మట్టి, రాళ్లు పోసిన ఆక్రమణదారులు**

- చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసుల వినతి



కాలనీలకు వెళ్లే దారికి అడ్డంగా పోసిన మట్టి, రాళ్లు

**అబ్దుల్లాపూర్‌మెట్:** కాలనీలకు వెళ్లే ప్రధాన దారిని కబ్జా చేసేందుకు పలువురు వ్యక్తులు యత్నించిన ఘటన పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని 4వ వార్డులో మంగళవారం చోటు చేసుకుంది. కాలనీవాసుల వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలో బృందావన్‌హోటల్‌కు ఆనుకుని జాతీయ రహదారి నుంచి పలు కాలనీలకు వెళ్లేందుకు ఆయా లే అవుట్లు చేసిన సమయంలో (సర్వేనంబర్ 175) రోడ్డును వేశారు. దాదాపు 25 ఏళ్ల కావస్తున్నప్పటికీ ఇటీవల కొంతమంది ఆ రహదారిని కబ్జా చేసేందుకు యత్నించారు. రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించి, భారీ కంటైనర్‌ను ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక ఆపిల్ ఎవెన్యూ కాలనీ అసోసియేషన్, వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటు చేసుకోగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో పోలీసులు, మున్సిపల్ అధికారులకు రెండు కాలనీల ప్రజలు ఆక్రమణదారులపై ఫిర్యాదు చేయగా అటు వైపు వెళ్లకూడదని హెచ్చరించారు. అయినా ఆక్రమణదారులు ఆగడాలను ఆపడం లేదు. మంగళవారం కాలనీల్లోంచి బయటకు వచ్చే మార్గంలో పెద్ద ఎత్తున మట్టి, రాళ్లను నింపడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ విషయంలో అధికారులు స్పందించి కోర్టు ఉత్తర్వుల ప్రకారం తమకు న్యాయం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

**పహాడీషరీఫ్:** ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన సోమవారం అర్ధరాత్రి బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిస్మిల్లా కాలనీలో మహ్మద్‌హాజీ ప్లాస్టిక్ గోడౌన్ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి ఒక్కసారిగా గోడౌన్‌లో మంటలంటుకున్నాయి. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న యజమాని అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం చేరవేశాడు. దీంతో పోలీసులు రెండు ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటేనా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని యజమాని పోలీసులకు వివరించాడు.



వ్యాపిస్తున్న మంటలు

# అందరికీ సంక్షేమ పథకాలు

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు:** రాష్ట్రంలోని ప్రజాపాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అనంతరెడ్డి, కిషన్‌రెడ్డి, డా.శ్రీనివాస్, రమేశ్‌యాదవ్, రఘుపతి, శ్రీశైలం, విఠలయ్యగౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

**సాగునీరు అందించడమే లక్ష్యం**

కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో రైతులందరికీ సాగునీరు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ82 కాలువ ద్వారా ఆమనగల్లు వరకు సాగునీరు తీసుకు వస్తామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఏడాది కాలంలో నియోజక వర్గానికి బీటీరోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు మంజూరయ్యాయని ఆయన వివరించారు. దాదాపు రూ.40 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామని ఆయన చెప్పారు. అభివృద్ధి నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

# సమస్యలపై నిరంతర పోరాటం



ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ వేడుకల్లో విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

**ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్**

**ఇబ్రహీంపట్నం:** విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్, డివిజన్ అధ్యక్షుడు బోడ వంశీలు అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఇబ్రహీంపట్నంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1970లో ఎస్‌ఎఫ్‌ఐ కేరళ రాష్ట్రంలో ఏర్పడినప్పటి నుంచి విద్యారంగ సమస్యల పరిష్కారానికై అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం, సోషలిజం భావజాలంతో తమ సంఘం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, సంక్షేమ హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యావిధానాన్ని అమలు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీకాంత్, విప్లవకుమార్, లక్ష్మణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## 'పారిశ్రామిక వాడ'కు భూ సర్వే

**పర్యవేక్షిస్తున్న తహసీల్దార్‌లు**

**దుద్యాల్:** లగచర్ల ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఫార్మాసిటీకి బదులుగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంకల్పించింది. ఇందులో భాగంగా మండల పరిధిలోని హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాలలో ఏర్పాటు చేయదలిచిన పారిశ్రామిక వాడకు భూసేకరణ పనులు ముమ్మరం చేశారు. మంగళవారం మండల పరిధిలోని హకీంపేట్ గ్రామానికి చెందిన 351 ఎకరాలకు కొడంగల్ తహసీల్దార్ విజయ్ కుమార్, దుద్యాల్ తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. పట్టాదారుడు వద్ద సర్వే నంబర్ ప్రకారం వారి భూమి మూలాలను గుర్తిస్తున్నారు. ప్రస్తుతం పట్టా పాసుపుస్తకంలో ఉన్న పొజిషన్‌లోనే ఉన్నారా లేదా అని సర్వే ఆధారంగా గుర్తిస్తున్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే సర్వేకు ముగ్గురు సర్వేయర్లకు ముగ్గురు ఆర్‌ఐలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్‌ఐలు నవీన్, రాఘవేందర్, వేణు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## హత్య కేసులో నిందితురాలికి జీవిత ఖైదు

**రూ. 10 వేల జరిమానా**

**అబ్దుల్లాపూర్‌మెట్:** రెండు నెలల బాలుడి హత్య కేసులో నిందితురాలు ఓరుగంటి శ్వేత (21)కు జీవిత ఖైదుతో పాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 12వ అదనపు కోర్టు తీర్పునిచ్చింది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. 2021లో జూన్ 18న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ కేసు నమోదైంది. ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లి గ్రామానికి చెందిన దూసరి లలిత ప్రసవం కోసం తల్లిగారిల్లు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామానికి వచ్చింది. అక్కడ బాలుడికి జన్మనిచ్చింది. రెండు నెలలుగా తల్లి ఇంట్లోనే బాలుడితో కలిసి ఉంటుంది. తన మేనమామ భార్య ఓరుగంటి శ్వేత తల్లి పక్కలోంచి బాలుడిని ఎత్తుకెళ్లి ఇంటిపై ఉన్న నీళ్ల ట్యాంకులో ముంచి అత్యంత కిరాతకంగా హత్య చేసిన సంఘటన అందరికీ తెలిసిందే. ఈ కేసులో విచారణ చేపట్టి పూర్తిస్థాయి ఆధారాలతో సహా న్యాయమూర్తి ఎదుట అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు చార్జిషీటు దాఖలు చేయగా కేసు పూర్వాపరాలు పరిశీలించినంతరం నిందితురాలికి జీవితి ఖైదు విధించింది.

## అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

**పహాడీషరీఫ్:** అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం వెలుగుచూసింది. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన చింతకింది కాసీం(50) ఐదేళ్ల క్రితం మల్లాపూర్‌కు వలస వచ్చి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం భార్య సొంతూరుకు వెళ్లింది. రాత్రి భోజనం చేశాక నిద్రకు ఉపక్రమించిన కాసీం మంగళవారం ఉదయం ఎంతకూ లేవలేదు. పక్కింటి వారు తలుపులు తట్టి చూడగా ఆయన మృతి చెంది కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ మృతుడి భుజంపై ఘాట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ మెడలోంచి గొలుసు చోరీ

**పహాడీషరీఫ్:** రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండగుడు బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. ఈ ఘటన సోమవారం రాత్రి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడకు చెందిన ముచకాకుల సరస్వతి(56) రాత్రి 9.30గంటల ప్రాంతంలో తన కిరాణ దుకాణానికి తాళం వేసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. ఓ గుర్తు తెలియని యువకుడు ఆమెను అనుసరిస్తూ మూడు తులాల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా చంద్రశేఖర్



**షాబాద్:** గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా హైతాబాద్ గ్రామానికి చెందిన కావలి చంద్రశేఖర్ నియమితులయ్యారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం పాలకవర్గ ఉత్తర్వులను జారీ చేసింది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఉన్న చంద్రశేఖర్ రెండేళ్లపాటు మార్కెట్ కమిటీలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## షాద్‌నగర్‌లో దారుణం

**చెట్ల పొదల్లో పసికందు మృతదేహం**


**షాద్‌నగర్‌రూరల్:** నవమాసాలు బిడ్డను కడుపులో మోసిన తల్లి పురుటి నొప్పులను భరించి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ముక్కుపచ్చలారని ఆ పసికందును గుర్తు తెలియని వ్యక్తులు చెట్ల పొదల్లో పడేసి వెళ్లారు. ఈ హృదయ విదారక ఘటన షాద్‌నగర్ మండల పరిధిలోని చటాన్‌పల్లి చాక్లెట్ పరిశ్రమ పక్కన మంగళవారం వెలుగుజూసింది. వివరాలు.. చెట్ల పొదల్లో ఉన్న గుర్తు తెలియని పసికందు మృతదేహాన్ని కుక్కలు ఈడ్చుకుంటూ వెళ్తున్నాయి. అటుగా వెళ్తున్న వాహనదాలు గమనించి కుక్కలను తరిమికొట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పసికందు వివరాలు తెలియరాలేదన్నారు.

## మహిళను ఏమార్చి ఏటీఎం కార్డు చోరీ

**రూ.25 వేలు విత్ డ్రా**

**తాండూరు టౌన్:** ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసుకునేందుకు వచ్చిన మహిళను ఏమార్చి ఆమె ఖాతా నుంచి డబ్బు కాజేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ సంతోశ్ కుమార్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందని శోభ పొదుపు సంఘంలోని తన వాటా నగదు రూ.25వేలు డ్రా చేసేందుకు స్థానిక యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్దకు వెళ్లింది. అక్కడే ఉన్న వ్యక్తికి తన కార్డు ఇచ్చి తనకు కార్డు వాడడం రాదని డ్రా చేసి ఇవ్వాలని కోరింది. దీంతో ఆ వ్యక్తి కాసేపు డ్రా చేస్తున్నట్లు నటించి నగదు రావడం లేదని ఓ పాత కార్డు ఇచ్చి అక్కడ నుంచి ఉడాయించాడు. కాసేపటికి తన ఖాతా నుంచి రూ.25వేలు నగదు ఉపసంహరించినట్లు గుర్తించి సోమవారం తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో విక్రేతలు

**అనంతగిరి:** రూట్ వాచ్‌లో ఉన్న వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ పోలీసులు మంగళవారం గంజాయిని సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, పరిగి సీఐ సీరజ, వికారాబాద్ సీఐ రాగవీణ, ఎస్ ప్రేమ్‌కుమార్‌రెడ్డి పరిగిలోని రూప్‌ఖాన్‌పేట వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో దుద్యాలకు చెందిన నవీన్ కుమార్ బైక్‌ను ఆపి తనిఖీ చేయగా అతని వద్ద 150గ్రాముల గంజాయి లభ్యమైంది. పోలీసులు విచారణ మేరకు హైదరాబాద్‌లోని రామంతాపూర్‌కు చెందిన ఆదిమూల మల్లేశ్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలపడంతో అక్కడకి వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మల్లేశ్ వద్ద 930 గ్రాముల గంజాయి లభ్యమైంది. వీరి పై గతంలో ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరిలో నూ కేసులున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**



ఆలయకమిటీ సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

**పరిగి:** పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆలయంలో ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఆలయకమిటీ సభ్యులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దాహార్తిని తీర్చుకునేందుకు వెళ్లి..

**బావిలో పడి మృతి**



పద్మమ్మ మృతదేహం

**దోమ:** దాహార్తిని తీర్చుకునేందుకు వెళ్లిన మహిళ బావిలోపడి మృతి చెందింది. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పాలేపల్లిలో గ్రామానికి చెందిన మంగళి పద్మమ్మ(37) జీవాలను మేపేందుకు వెళ్లింది. సాయంత్రం దాహం వేయడంతో సమీపంలోని బావి వద్దకు నీరు తాగేందుకు వెళ్లడంతో కాలు జారి పడిపోయింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో సమీప పంటపొలాల దగ్గరకు వెతుకుతుండగా ఓ బావి గట్టుపై చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. బావిలో నీరు అధికంగా ఉండడంతో గ్రామస్తులు మోటార్ల సాయంతో నీరు బయటకు తోడగా పద్మమ్మ శవమై కనిపించింది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతురాలికి ఎనిమిదేళ్ల కూతురున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## లగచర్ల వద్ద పోలీస్ పికెటింగ్



లగచర్ల గేట్ వద్ద పోలీసుల పహారా

**దుద్యాల్:** మండల పరిధిలోని లగచర్ల గేటు సమీపంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు ముందుస్తుగా అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. రోటిబండ తండా, పులిచర్లకుంట తండా, లగచర్ల గ్రామాలకు మధ్య లగచర్ల గేటు వద్ద పోలీసు సిబ్బందిని పహారా కాస్తోంది.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



వ్యవసాయ మార్కెట్‌లో పనులను ప్రారంభిస్తున్న నాయకులు

**ధారూరు:** వ్యవసాయ మార్కెట్‌లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని మంగళవారం ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఉపాధిహామీ పథకం నుంచి మంజూరైన రూ.30లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి వ్యవసాయ కార్యాలయం వరకు రూ.10లక్షలు, ఏఎంసీ కార్యాలయం కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు రూ.10లక్షలు, ఏఎంసీ దుకాణాల సముదాయం ఎదుట రూ.10లక్షలు కేటాయించారని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్లోళ్ల రాములు, ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాగా కుక్కింద గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులను పట్లోళ్ల రాములు ప్రారంభించారు.